# ఇది చాలా సున్నితం

"మరేం ఫరవాలేదు. రెస్ట్ తీసుకోండి" అన్నాడు డాక్టర్.

టాబ్లెట్లు, సిరప్ రాసిచ్చాడు. "నీరసం తగ్గే దాకా ఆఫీసుకి సెలవు పెట్టండి. రాత్రిళ్ళూ బైట కెళ్ళకండి. మంచులో తిరిగితే ప్రమాదం...."

ఇంటి కొచ్చాక ఆనందరావుకి అన్ని సపర్యలూ చేసింది మందాకిని.

"నీలా చేసి పెట్టే వాళ్ళూ హమేషా చూసుకునే వాళ్ళూ ఉంటే రోగం రావడం కన్న భోగమే ముంటుంది?" అన్నాడు ఆనందరావు.

"సరే లెండి...చూడబోతే నా సేవల కోసమే మీరు జబ్బు పడ్డట్టున్నారు..." అంది మందాకిని.

"ఆ సరికి జబ్బు పడకుంటే నువ్వు నన్ను పట్టించుకోనే పట్టించుకో వనే అపార్థం కూడా రాగలదు..."అన్నాడు ఆనందరావు వ్యాఖ్యానం చేస్తూ.

"ఎక్కువగా మాట్లాడకండి...నీరసం ఎక్కువవుతుంది..."అన్నది మందాకిని.

"నీతో మాట్లాడకనే కదూ నీరసం?"

"నమ్మాలా?"

"నమ్మవా?"

"నమ్ముతాను లెండి" అంటూ తల తిప్పుకుంది మందాకిని. ఆ సమయంలో ఆమె నవ్విందో లేదో, నమ్మిందో లేదో అతనికి తెలియదు.

"డాక్టర్ మాట వినరా? బైట తిరక్కూడదు కదా?"

"సినిమా క్కాదు కదా? అలా షికారెళ్ళొస్తాను...అలా గోపాలం ఇంటి దాకా...."

"గోపాలం గారు మధ్యాహ్నమే ఫోన్ చేసి చెప్పారు. వాళ్ళ పినతల్లికి హఠాత్తుగా జబ్బు చేసింది. చూడ్డానికని అందరూ బెజవాడ వెళ్ళారు. ఏదో

వ్యవహారం ఉందట కదా? మీతో...వచ్చాక మాట్లాడతానన్నారు."

"పోనీ అలా సినిమాకు వెళ్ళొస్తాలే! అలా చూస్తావేంటి? ఫస్ట్ షోకే..." అన్నాడు ఆనందరావు.

"మరీ చిన్న పిల్లలై పోతున్నారు. ఇండియాలో సినిమాల క్రేజ్ తగ్గి పదేళ్ళవుతోంది. ఆ టీవీ, ఈ టీవీ, ఎం టీవీ....ఎన్ని లేవు? పైగా డెక్ ఒకటి... చెప్పండి...ఏం...కేసెట్ కావాలో తెప్పిస్తాను..."

"అబ్బ! బోరెత్తి పోతోంది ఇంట్లో నాలుగ్గోడల మధ్యా వుండి..." అన్నాడు.

"ఎక్కడైనా నాలుగ్గోడలే...జ్వరం తగ్గే దాకా సినిమా మాటెత్తకండి. అంతకైతే సుబ్రమణ్యం గారికి ఫోన్ చేసి రమ్మంటాను. మీకు కాలక్షేపం కబుర్లు చెప్తాడు..." నవ్వు అణుచు కుంటోం దామె.

"ప్లీజ్ మందాకినీ! భయ పెట్టకు. పొరబాటున సుబ్రమణ్యం వస్తే నేను గాఢ నిద్రలో వున్నానని పంపెయ్యి. అతనొచ్చి వాళ్ళ మేనత్త గురించి చెప్పడం మొదలెడితే నాకు జ్వరం తిరగ బెడుతుంది. అయితే సినిమాకూ షికారుకూ వద్దా?"

"వద్దండీ ప్లీజ్! మీరు జబ్బుతో ఎక్కడికి వెళ్ళినా నా కిక్కడ స్థిమితం వుండదు. అంతకూ తప్పదంటే నేనూ వస్తాను పదండి..." అన్నదామె.

"ఎక్కడికి?"

"ఎక్కడికైనా సరే! సెకెండ్ షో సినిమా కైనా సరే"

"అదేం? నువ్వొస్తే జ్వరం పెరగదా నాకు?"

"నేనుండగా మీకేం కాదుగా! అయినా నేను తోడుంటే అదో ధైర్యం"

"వద్దులే! నీకూ జ్వరం తగిల్తే చూసే వాళ్ళెవరు?"

"మీరెలా దిగి వస్తారో నాకు తెలియకనా?"

ఆ మాటేమిటో బొత్తిగా అర్థం కాలేదు ఆనందరావుకు. అంటే పూర్తిగా అర్థం కాలేదు. అంటే బొత్తిగా అర్థం కాలేదని కాదు. అంటే కొంచెం అర్థం కాకుండా ఉండి పోయిందని.

"జ్వరం తగ్గి ఇవాళే ఆఫీసుకి వెళ్ళారు. మొహం చూడండి. చూసుకోండి అద్దంలో. ఎంత వాడి పోయారో తెలుసా?" అన్నది మందాకిని.

"అయితే ఏంటి? బుట్టెడు మందులు వాడాం. ఇంకో సంవత్సరం దాకా జ్వరం రాదు."

బుంగ మూతి పెట్టి చూస్తూనే ఉంది మందాకిని. తలెత్తదు. ఏదో తెర చాటు నుంచి మాట్లాడు తున్నట్టు అంది... "ఇవ్వాళ్ళ సినిమాకు వెళ్ళక పోతేనేం? ప్లీజ్! రాత్రి పూట మంచులో... చల్లగాలిలో... పోనీ నేనూ వస్తానంటే వద్దంటారు. నాకూ తోచదంటే వినరు..."

"నీకు ఇంటెడు పని ఉంటుంది ప్రొద్దున్నే. అయినా నేను వెంటనే సినిమాకు వెళ్ళి పోను కదా. కాస్సేపు క్లబ్బులో గడిపి, ఆ తరువాత ఇష్టమైతే సినిమాకి... అదీ ఇష్టమొచ్చిన సినిమాకి... అదే నీతో అలా వెళ్ళాలంటే కుదురుతుందా?"

ఆనందరావు మామూలు ఉద్యోగే. లాయర్ కాదు. అయినా చక్కగా వాదించగలడు. ఇల్లనే కోర్టులో భార్యనే జడ్జి ముందు తన కేసు తానే గొప్పగా వాదించు కోగలడు. నెగ్గుకు రాగలడు.

"సరే మీ ఇష్టం" అంది మందాకిని ముక్త సరిగా.

ఎస్! అదీ జడ్జిమెంటు. ఆనందరావుకు ఆ రోజు ఆ సాయంత్రం న్యాయం వర్థిల్లినట్టే.

ఇంటి తాళాలు రెండున్నాయి. ఆనందరావు కీబంచ్‌లో ఒక తాళం చెవి ఉంటుంది. రాత్రి పొద్దు పోయి వస్తాడు కదా. మందాకినిని నిద్ర లేపడం ఇష్టం వుండదు. తన కీ తోనే వచ్చేస్తాడు.

బెడ్ రూం తలుపు లోపల బోల్ట్ చెయ్యదు మందాకిని. అతన్ని వెయిట్ చేయించడం ఆమెకు ఇష్టం వుండదు. రాత్రి ఒకటిన్నర అయింది.

"వచ్చారా!" నిద్రలో కలవరిస్తున్నట్టు అంది మందాకిని. లేక అది నిద్రలో కలవరింతే నేమో.

(వచ్చారా! అనే ఒక్క మాటలో మోగే యుగమంత నిరీక్షణ ఆ గదిలో మెత్తగా ప్రతిధ్వనిస్తోంది.)

"సారీ మందూ" (ఏం ముద్దు పేరా? బెడ్‌లో చేరేప్పుడు అలాగే వస్తుంది మాట)

"ఏం సినిమా బాగోలేదా?" వత్తిగిలి సర్దుకుంటూ అతను ఫ్రీగా పడుకోవడానికి చోటిచ్చింది.

"బోర్ కొట్టేసింది. వెంటనే వచ్చేసే ఓపిక లేక అలా ఉండి పోయాను" అన్నాడు.

"ఫ్లాస్కులో పాలున్నాయి"

"నువ్వూ తాగుతావా?"

"ఛ్ఛ...నోరు బాగులే దిప్పుడు..."

"నిద్రపో మందూ! పాపం...వంటింట్లోనే అలిసి పోయి వుంటావు. బజ్జో..."

"ముందు మీరు బజ్జోండి..."

దాదాపు అరగంట తర్వాత... మగత నిద్ర లోనే తడుముకుంటున్నాడు ఆనందరావు.

ఇద్దరూ కళ్ళు తెరవలేదు. గదిలో మసక. కళ్ళ నిండా చిక్కటి నిద్ర. చీకటి. ఆ చీకటిలో ఆరాటం.

"మందూ డార్లింగ్"

"పడుకోండి... మళ్ళీ జ్వరమొస్తే?"

"ఏం రాదు గాని ఇటు తిరుగు...తిరగవా ప్లీజ్!"

"వద్దంటే"

"అంతేనా అయితే?"

"వద్దంటే వినరు...పిల్లాడి కన్నా హీనం..."

రాత్రి కరుగు తోంది.

తెల్లవారు ఝాము. మూడున్నర. బాత్ రూం లో నీళ్ళ గలగల. మగత నిద్ర చెదురుతుండగా పిలిచాడు.

"మందూ?"

"ఆఁ..."

"స్నానం చేస్తున్నా వేంటి... మరీ ఇంత ఎర్లీగా..."

"సారీ...మీకు నిద్ర చెడిందేమో"

"భలే దానివే"

కాస్సేపటికి ఘుమఘుమ లాడే ఆవిరితో వచ్చింది. బాత్ రూంలోంచి ఇంకా వెచ్చటి వేణ్ణీళ్ళ ఆవిరి.

దుప్పటి ముసుగు తన్ని పడుకున్నాడు.

ఆమె బాల్కనీ తలుపు ఇంకా గట్టిగా బిగించేసింది. కర్టెన్ పూర్తిగా వేసి సర్దింది.

కూని రాగం. హడావిడిగా గౌన్ తొడుక్కుంది. కాళ్ళు స్టూల్ మీద పెట్టుకుని కళ్ళు మూసుకుంది.

"కాస్సేపిలా నిద్ర పోతాను లేపకండి..."

"ఇలా వచ్చి పడుకో మందూ..."

"బెడ్ షీట్లు బాగు లేవు. చెమట వాసన. నిద్ర పట్టదు. షీట్లు ఇప్పుడు మార్చలేను...ప్లీజ్ నిద్ర పోండి"

"తిక్క మనిషివి... ఫ్రెష్‌గా స్నానం చేసి నిద్ర పోవడ మేమిటి? మంచి మడిగా వున్నావు సుమా. నిన్ను తాకడానికి కూడా భయమేస్తోంది."

"భయపడండి మరి"

మసక వెలుతురులో మల్లె మొగ్గల పలువరస కనిపించేలా మధురంగా నవ్వింది.

తల దిమ్ముగా ఉందని ఆ రోజు ముందే పడుకుంది మందాకిని. ఆనందరావు స్వయంగా వడ్డించుకు తిన్నాడు. మందాకినికి అమృతాంజనం రాశాడు. ఇక వద్దంది. టీవీ బోర్ కొట్టింది. అలవాటు పడ్డ ప్రాణం. తిరిగే కాలు ఊరుకోదు.

"మందాకినీ నీకు నిద్రొస్తోందేమో! నాకు బోర్ కొడుతోందోయ్" అన్నాడు ఆనందరావు.

"మీ ఇష్టం"

"ఏదైనా సినిమాకి వెళ్ళి రానా?"

వద్దంటే ఆగిపోదామనే!

"మీ ఇష్టం"

"అలా క్కాదు రాణీ...నీ కిక్కడ బోర్ అయితే నాకూ బాధే కదూ? నువ్వు వెళ్ళమంటేనే..."

"మీ ఇష్ట మన్నానా... వెళ్ళి రండి...."

"ఏదైనా ఇంగ్లీష్ సినిమాకు వెళ్తాలే. తొందరగా గంటన్నరకే అయిపోతుంది. తొందరగా వచ్చేస్తాను."

"మీ ఇష్టం. నాకేం ఫరవాలేదు వెళ్ళి రండి."

"ఓకే...బాగా నిద్రపో అయితే"

వెళ్తుండగా ఆపింది..."గుమ్మం దగ్గర కిటికీలో చూడండి" అన్నది

మందాకిని.

"ఏం చూడాలీ?"

"చూడమన్నానా?"

ఏంటో అర్థం కాదు. పోస్ట్‌లో వచ్చిన లెటర్ ఏదైనా అక్కడ ఉండి పోయిందేమో అనుకుంటూ వెళ్ళాడు. తొందరగా బైట పడాలని ఉంది అతని కైతే. తాళాల గుత్తితో రెడీగా డోర్ వెయ్య బోతూ కిటికీలో చూశాడు. చిన్న బాక్సు. అట్ట పెట్టె. ఏదో గిఫ్ట్ ప్యాక్‌లా వుంది. వారగా తెరిచి చూశాడు. లోపల నాలుగు పౌడర్ డబ్బా లున్నాయి. అవి మామూలుగా మందాకిని వాడేవే. అటువంటివే. ఏమిటీ తిక్క మనిషి. వీటిని చూడ మంటుందేమిటి? అనుకుంటూ ఆ పౌడర్ డబ్బాలు సర్ది చూడగా...

చక్కటి కాయితం మడత...పలకరించింది.

అది మందాకిని రాతే!

"ప్రియమైన శ్రీవారూ!

వెళ్ళబోయిన వారు వెనక్కి రాకండి. నాకేమీ సర్ది చెప్పకండి. బాధపడకండి. ఎప్పటిలా వుండండి. మీరు చాలా తెలివైన వారు. మీ క్లబ్బులు, సెకెండ్ షోలు...అన్నీ నాకు తెలుసు. పాపం నా మీద ప్రేమ తగ్గకుండా ఎంత జాగ్రత్తగా మథన పడుతున్నారో! జబ్బులు రాకుండా చూసుకునే తెలివి ఎలాగూ మీకు వుంటుంది కానీ...ఎవరో గాని ఎవరితోనో గాని ఆర్నెల్లుగా అదే లోకం మీకు. కానివ్వండి. కాని ఆ పౌడర్ ఎక్కువగా వాడుతున్నట్టుంది. అదంతా మీకు పూర్తిగా అంటుకుంటోంది. చెమటతో కలిసి ఇక్కడ దాకా వచ్చి మళ్ళీ నాకంతా అవుతోంది. మన బెడ్ కూడా అదే వాసన. అది ఘాటు పౌడర్. ఖరీదు కన్నా ఘాటు ఎక్కువ. దయచేసి ఈ పౌడర్ వాడమనండి.

చిన్న సర్దుబాటు. ప్లీజ్! ఇది చాలా సున్నితం. సిగ్గు పడకండి. నాకిష్టం ఉండదు.

--మందూ"

01.11.1996 సంచిక